నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగించటం, మెయింటెనెన్స్ పనుల కారణంగా సోమవారం మణికొండ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శివాజీనగర్, సెక్రటేరియట్ కాలనీ, సుందర్‌గార్డన్స్, గోల్డెన్ టెంపుల్, పైప్‌లైన్ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలో...

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి సబ్ స్టేషన్ బృందావన్ కాలనీ ఫీడర్ పరిధిలోని టాటానగర్, బృందావన్ కాలనీ, ప్రగతి కాలనీ, మొగల్స్ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి విలేజ్ ప్రాంతాలలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సబ్‌స్టేషన్ ఏఈ పేర్కొన్నారు.

వేడుకగా సత్యనారాయణ స్వామి వ్రతాలు

అత్తాపూర్: అత్తాపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనాలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గంధం అరవింద్‌గుప్తా ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు నిర్వహించారు. కార్తీక వనభోజనాలను చేశారు. ప్రధాన కార్యదర్శి బచ్చు అశోక్‌గుప్తా, కోశాధికారి సిద్దెల్లి వీరేశ్‌గుప్తా, మాజీ అధ్యక్షులు ఆకులతోట విజయ్‌కుమార్‌గుప్తా, చంద్రశేఖర్‌గుప్తా, కొక్కొల్ల సత్యంగుప్తా, ఎన్నం కృష్ణాగుప్తా పాల్గొన్నారు.

సన్మానం



బండ్లగూడ: అడిషనల్ డైరెక్టర్ ఇన్ఫర్మేషన్, పబ్లిక్ రిలేషన్ డిపార్ట్‌మెంట్ సెక్రటేరియట్‌లో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన కె.నాగయ్యను బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోకరి సురేష్‌గౌడ్ సన్మానించారు. ఎస్‌ఎం ఎంక్లేవ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కె.నాగయ్యను శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఎస్‌ఎం ఎంక్లేవ్ ఫేస్–1 అసోసియేషన్ సభ్యులు భీమ్‌రెడ్డి, వాసవి, సంగమేశ్వరి, శ్రీకాంత్, నళిని, సమత, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ధ్వంసం కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడు సల్మాన్ అర్మాన్

శంషాబాద్ రూరల్: మండలంలోని జూకల్ గ్రామంలోని ఆలయాల్లో విగ్రహాల ధ్వంసం కేసులో నిందితుడిని చేసిన పోలీసులు అరెస్టు చేసి ఆదివారం కోర్టులో హాజరుపర్చారు. జూకల్‌లో శనివారం రాత్రి ఓ యువకుడు చౌడమ్మ, సోమన్న ఆలయాల్లోని విగ్రహాలను ధ్వంసం చేయడంతో పాటు వస్త్రాలను తొలగించాడు. గమనించిన స్థానికులు అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇతను మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లా సవ్ఖేడా గ్రామానికి చెందిన సల్మాన్ అర్మాన్ తాడ్వీగా పోలీసుల విచారణలో తేలింది. ఇతనిపై గతంలో రాయ్‌గడ్ జిల్లా తాల పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం, ఇంటికి నిప్పు పెట్టిన కేసు నమోదు అయింది. ఈ కేసులో జైలుకు సైతం వెళ్లాడు. జూకల్ ఘటనలో ఇతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతన్ని కోర్టులో హాజరు పర్చగా రిమాండ్‌కు పంపారు.

సంపులో పడి మహిళ మృతి



మృతి చెందిన పల్లవి

రాజేంద్రనగర్: సంపులో పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ భానుమతి సమాచారం మేరకు... ఉప్పర్‌పల్లి హ్యాప్పీ హోమ్స్‌లో పల్లవి(26) అనే మహిళ తన భర్త ఇద్దరు పిల్లలతో కలిసి వాచ్‌మెన్‌గా పని చేస్తుంది. ఆదివారం ఉదయం భర్త గ్రామానికి వెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం పల్లవి అపార్ట్‌మెంట్‌లోని సంపులో పడి మరణించి ఉండటాన్ని అపార్ట్‌మెంట్ వాసులు గమనించారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఘనంగా ఉర్దూ దినోత్సవం



గోల్కొండ: గోల్కొండ మోతీ దర్వాజాలోని ది రైజింగ్ స్టార్ నేషనల్ హైస్కూల్‌లో ఆదివారం అంతర్జాతీయ ఉర్దూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉర్దూ కవిత పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ షేహబాజ్ అహ్మద్ ఖాద్రీ మాట్లాడుతూ.. ఉర్దూ ఎంతో సరళమైన భాష అని భారతదేశంలో ప్రజాదరణ పొందిన భాష అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన పలు విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కవితలు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

నిత్యావసర సరుకులు, టేలా బండ్ల పంపిణీ

చార్మినార్: తాను గత శాసనసభ ఎన్నికలలో విజయం సాధిస్తున్నానని తెలుసుకున్న మజ్లిస్ పార్టీ అక్రమాలకు పాల్పడి పోలీసుల చేత అరెస్టు చేయించి ఎమ్మెల్యే కాకుండా ఆపారని మజ్లిస్ బచావో తహరీక్ (ఎంబీటీ) అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ అంజాదుల్లా ఖాన్ ఆరోపించారు. యాకుత్‌పురా నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన పేదలకు నెల రోజుల సరిపడా నిత్యావసర సరుకులతో పాటు వ్యాపారం నిర్వహించుకునేందుకు టేలా బండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా లేనప్పటికీ నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎంబీటీ నాయకులు బుంగ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘వేవ్‌రాక్’ బస్టాండ్... సాధ్యమేనా?



నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని వేవ్‌రాక్ ముందు ఆగిన బస్సులు

కొండాపూర్, లింగంపల్లి కన్నా ‘వేవ్‌రాక్’ వద్ద ఎక్కువ బస్సుల రాకపోకలు

- ఖాళీ స్థలంలోనే ఆగుతున్న ఆర్టీసీ బస్సులు
- అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాంతమైనా బస్టాండ్ నిర్మాణంపై జాప్యం

రాయదుర్గం: అది ఎంతో ప్రాధాన్యత కలిగిన ప్రాంతం. అందునా వందలాది ఆర్టీసీ బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న ప్రపంచంలోనే అత్యంత పేరెన్నికన్న ఐటీ, ఆర్థిక, ఇతర సంస్థలకు కేంద్రమైన నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం. ఇందులో లాస్ట్ స్టాప్‌గా పిలిచేదే వేవ్‌రాక్ సంస్థ భవనాల ముందు, అమెజాన్ సంస్థ చేరువలో అనధికార బస్టాండ్ ఖాళీ స్థలంలో కొనసాగుతోంది.

◆ ఇక్కడికి నగరం నలుమూలల నుంచి ఆర్టీసీ సంస్థ అనేక రకాల బస్సులు అంటే ఆర్డినరీ, సిటీ ఎక్స్‌ప్రెస్, ఏసీ బస్సులను సైతం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని వేవ్‌రాక్ వరకు నడుపుతోంది. ఈ నేపథ్యంలో అక్కడ ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

◆ అయినా ఆర్టీసీ అధికారులు, టీజీఎస్‌ఐఐసీ అధికారులు కానీ ఎలాంటి చర్య లు తీసుకోకపోవడం విడ్డూరం. ఆర్టీసీ అధికారులు బస్సులు నడపడంపై, ఐటీ, ఇతర ఉద్యోగులకు రవాణా సౌకర్యాల కల్పనపై టీజీఎస్‌ఐఐసీ దృష్టి పెడుతున్నాయి. తప్ప ఆర్టీసీ బస్సులు వందలాదిగా వస్తుంటే బస్టాండు ఏర్పాటు చేయాలనే ఆలోచన ఇప్పిటికీ చేయకపోవడం విడ్డూరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పలువరు కోరుతున్నారు.

◆ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అత్యధిక బస్సులు రాకపోకలు నిర్వహించేంది కూడా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని వేవ్‌రాక్ నుంచే. ఇక్కడికి నగరం నలుమూలల నుంచి అంటే ఉప్పల్, సికింద్రాబాద్, దిల్‌సుఖ్‌నగర్, మెహిదీపట్నం, కోఠి, కూకట్‌పల్లి, బాచుపల్లి, లింగంపల్లి, పటాన్‌చెరు, బాలానగర్ సహా పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ సంస్థ ఐటీ, ఇతర ఉద్యోగుల కోసం బస్సులను నడుపుతోంది. మొదట్లో ఆర్టీసీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులే నడిచేవి. ఆతర్వాత ఏసీ బస్సులను కూడా నడిపిస్తోంది. దీంతో బస్సులలో రాకపోకలు విపరీతంగా పెరిగిపోయింది.

◆ దీంతోనే పెద్ద సంఖ్యలో బస్సుల ట్రిప్పులను పెంచుతూ పోతున్నారు. ఇంత జరుగుతున్నా కానీ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేయకపోవడం విడ్డూరం.

ప్రయాణికులు చెట్ల కింద నిలవాల్సిందే...

◆ వేవ్‌రాక్ నుంచి వందలాది బస్సులు రాకపోకలు సాగిస్తున్న ప్రాంతంలో లాస్ట్ స్టాప్ కావడంతో ఇక్కడికే అంతా ఐటీ, ఇతర ఉద్యోగులు వచ్చి చెట్ల కింద వేచి ఉండి ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. కనీసం ప్రయాణికులకు కూర్చోవడానికి కూడా ఎలాంటి సౌకర్యాలు లేకపోవడం మరో విడ్డూరం. అంతేకాకుండా ఒకచోటును ఏర్పాటు చేసుకొని అక్కడ ఆర్టీసీ అధికారులు నిల్చొని బస్సుల రాకపోకలను పర్యవేక్షిస్తూ వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు ఇక్కడే ఉండాల్సిన అవసరం ఉంది. వీరికి కనీస సౌకర్యాలు కూడా లేకుండా పోయినా విధులను నిర్వహించాల్సిందే. తెల్లవారుజాము నుంచి 11 గంటల వరకు ఆ తర్వాత 4 గంటల నుంచి రాత్రి వరకు బస్సుల ట్రిప్పుల సంఖ్య గణనీయం గా ఉండటంతో ఎండ, వానలో నానా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ప్రయాణికులకే కాకుండా ఆర్టీసీ అధికారులదేనని చెప్పకతప్పదు.

◆ నానక్‌రాంగూడలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు కోసం గతంలో స్థలాన్ని కేటాయించారు. ఆ తర్వాత ఈ స్థలం మాదేనని టీఎస్‌ఐఐసీ సంస్థ స్పష్టం చేయగా అందులో వాహనాల చార్జింగ్ పాయింట్, బస్టాండ్ ఏర్పాటు చేయాలని తలపెట్టగా నానక్‌రాంగూడవాసులు పెద్ద ఎత్తున నిత్య ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. దీంతో తమ ప్రతిపాదనను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, అప్పటి కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా జోక్యంతో టీఎస్‌ఐఐసీ తమ ప్రతిపాదన విరమించుకొంది. దీంతో ఈ ప్రతిపాదన అంత వరకే నిలిచిపోయింది. ఇక తప్పనిసరి పరిస్థితిలో వేవ్‌రాక్ ముందున్న ఖాళీ స్థలంలోనే బస్సులను ఆపుతూ రాకపోకలు సాగిస్తున్నారు. భవిష్యత్తులోనైనా అనువైన స్థలాన్ని కేటాయించి బస్టాండ్‌ను నిర్మాణం చేస్తే ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరినట్లవుతుంది, ఆదిశగా ఆర్టీసీ, టీఎస్‌ఐఐసీ, జీహెచ్‌ఎంసీ సంయుక్తంగా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి



మాట్లాడుతున్న వనంపల్లి జైపాల్‌రెడ్డి

అత్తాపూర్: మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ గ్రౌండ్‌లో మున్సిపల్ కార్మికుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ మండల ఏఐటీయూసీ కార్యదర్శి టి.ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లోని అన్ని విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులకు న్యాయం జరుగుతుందని ఎంతో ఆశతో పర్మనెంట్ చేస్తారని కార్మికులందరూ ఎదురు చూస్తున్నారన్నారు. పర్మనెంట్ చేసేంత వరకు కార్మికులకు కనీస వేతనాలు రూ. 26 వేలు అమలు చేయాలన్నారు. కార్మికులు విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణిస్తే కార్మికుల కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్‌లో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక...

అత్తాపూర్ డివిజన్ మున్సిపల్ సంఘం నూతన కార్యవర్గ సభ్యులను వనంపల్లి జైపాల్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీను, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా శ్రావణ్, ఉపాధ్యక్షులుగా ఎస్.భారతమ్మ, వెంకటేష్, అనిల్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా అనిత, ఊర్మిళ, దుర్గాబాయి, కోశాధికారిగా అబ్రహం, కౌన్సిల్ సభ్యులుగా డి.వెంకటయ్య, యాదయ్య, నర్సమ్మ, జయంతు, రమల, సుజాత, పద్మ, కె.లక్ష్మి, దుర్గాబాయి, డొక్కలమ్మ, లక్ష్మి, శోభా, మరో ఐదు గురు కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

‘విద్యాంజలి’లో ఉత్సాహంగా కిడ్స్ కార్నివాల్





శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జోయస్స్ కాలనీ విద్యాంజలి స్కూల్‌లో కిడ్స్ కార్నివాల్‌ను ఉత్సాహంగా శుక్రవారం రాత్రి నిర్వహించారు. కిడ్స్ కార్నివాల్ చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలతో స్కూల్ ప్రాంగణం మారుమోగింది. వక్రతుండ అనే శాస్త్రీయ నృత్యంతో కార్యక్రమాలను ప్రారంభించారు. యూకేజీ చిన్నారుల అమ్మ జోల పాట అందరినీ ఆకట్టుకోగా, నానాటికీ కనుమరుగవుతున్న నాటక రంగ ప్రాధాన్యతను కాపాడేందుకు 1, 2వ తరగతులు చదివే విద్యార్థులచే ‘శశిరేఖా పరిణయం’ (మాయాబజార్) తల్లిదండ్రులను ఆకట్టుకుంది. 2వ తరగతి విద్యార్థులచే హనుమాన్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత్ వికాస్ పరిషత్ నమో గంగా ఆధ్వర్యంలో గురువందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిల్డ్రన్స్ డాక్టర్ అర్జున రాజ్ కుమార్, అతిథిగా కరస్పాండెంట్ ఎల్.నర్సింహారెడ్డి, అడ్వైజర్‌గా మమతారెడ్డి హాజరై గత ఏడాది అకడమిక్స్ సత్తా చాటిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలాత్రిపురసుందరి తదితరులు పాల్గొన్నారు.

నేడు మౌలానా ఆజాద్ స్మారక ఉపన్యాసం

రాయదుర్గం: జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా ఆజాద్ స్మారక ఉపన్యాసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమాన్ని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని డీడీఈ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారు. ‘మనూ’ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) మాజీ డైరెక్టర్ పద్మశ్రీ కృష్ణకుమార్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొంటారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: పేద, మధ్య తరగతి ప్రజానీకానికి ఆర్థిక భరోసాగా ముఖ్య మంత్రి సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్) నిలుస్తోందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన నివాసంలో సీఎంఆర్‌ఎఫ్ ఆరు మంది లబ్ధిదారుల కుటుంబసభ్యులకు రూ. 3.18 లక్షల చెక్కులను ఆయన చేతుల మీదుగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఆయన పేర్కొన్నారు. సీఎంఆర్‌ఎఫ్ నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం లా ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలు, అభాగ్యులఅకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసాను కల్పిస్తోందని ఆయన గుర్తుచేశారు.పేద మధ్యతరగతి వారికి ఆస్పత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అందులో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఎన్నో వందల కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకున్నామని ఆయన గుర్తు చేశారు. నాయకులు సంజీవరెడ్డి, దామోదర్‌రెడ్డి, మంత్రిప్రగడ సత్యానారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాలో రాణిస్తున్న ఏజీవర్సిటీ విద్యార్థులు



యోగాలో రాష్ట్ర స్థాయి అవార్డు అందుకుంటున్న సాహిత్యలక్ష్మి



యోగా చేస్తున్న విద్యార్థిని

ఏజీవర్సిటీ: తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11 రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థిని డి.సాహిత్యలక్ష్మి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి రజిత పతకాన్ని సొంతం చేసుకుంది. కళాశాల యాజమాన్యం సాహిత్యలక్ష్మిని ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్ మాట్లాడుతూ... విద్యార్థుల కోసం నిత్యం యోగా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. యోగాతో శారీరకంగా, మానసికంగా ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. ముఖ్యంగా యోగాను రోజువారీ కార్యక్రమంలో భాగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలాంటి మానసిక ఒత్తిడిలకు గురికాకుండా ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కళాధర్ బాబు, ఏఎస్‌ఏ డాక్టర్ నాగహర్షిత, పీడీ శ్రీధర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు



సత్యసాయి భజనలో పాల్గొన్న భక్తులు

మణికొండ: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా మణికొండలో అఖండ భజన, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6 నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు అఖండ భజన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బస్వరాజు మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు తమ బోధనలు, సేవా కార్యక్రమాలతో సత్యసాయి బాబా వారి జీవితాలలో నిలిచిపోయారన్నారు. కోట్లాది మందికి తన సేవా కార్యక్రమాలతో జీవితాలలో మార్పులు తెచ్చారన్నారు. బాబా భౌతికంగా లేకపోయినా ఆయన సేవలు, బోధనలు చిరస్మరణీయమన్నారు. ఆయా కార్యక్రమాల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి



యూజీసీ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

రాయదుర్గం: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కార్యదర్శి ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషికి హెచ్‌సీయూ అఖిలభారత విద్యార్థి పరిషత్ నాయకుల బృందం ఒక వినతిపత్రాన్ని అందించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. గత జేఆర్‌ఎఫ్ స్కోర్స్‌ను ప్రస్తుత సంవత్సరం అడ్మిషన్లకు తీసుకొని అవకాశం కల్పించేలా చూడాలని వారు సూచించారు. హెచ్‌సీయూలో చాలా మంది విద్యార్థులు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారని వారు ఆయన వివరించారు. మరింత ఎక్కువ మందికి అవకాశాలు కల్పించాల్సిన తరుణంలో నిబంధనల పేరిట పక్కన పెట్టడం సరికాదని, ఈవిషయంలో విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. అలాగే ప్రతి యూనివర్శిటీలో ఉన్న సమస్యలను కూడా వారు వివరించి వాటిపై దృష్టి సారించాలని వారు కోరగా ఈ విషయం పరిశీలించి తగిన న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి సాక్షి, ఎన్‌ఈసీ ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ‘అంబిటస్ కిండర్ వరల్డ్’ క్రీడా వార్షికోత్సవం



రాయదుర్గం: గచ్చిబౌలిలోని అంబిటస్ కిండర్ వరల్డ్ స్కూల్ క్రీడా వార్షికోత్సవాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ క్రీడోత్సవాన్ని ‘అంబిలీప్’ పేరిట జరిపారు. కెంబ్రిడ్జ్ ఎర్లీ లెర్నింగ్ సెంటర్ చిన్నారుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిల్లల కినెస్టెకిల్ స్కిల్, సమన్వయం, సహకారం, క్రీడాస్ఫూర్తి అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రోలర్ స్కేటింగ్ చాంపియన్ కావ్యషా మాట్లాడుతూ... పిల్లలకు చదువుతోపాటు వారికి నచ్చిన క్రీడలలో రాణించేలా ప్రోత్సహిస్తే ఉజ్వల భవిష్యత్ సాకారం అవుంతుదన్నారు. స్టార్‌లైట్ వెల్నెస్ సెంటర్ వ్యవస్థాపకురాలు అన్జలిడాంగే మాట్లాడుతూ... చిన్నారుల పోషణ, సంపూర్ణ ఆరోగ్యంపై తల్లదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం చిన్నారులు చేసిన జిమ్నాస్టిక్స్, ఇతర క్రీడా కసరత్తులు, థీమ్ ఆధారిత పరికరాలతో నిర్వహించిన రేసులు అందరినీ ఆకట్టుకున్నాయి, అనంతరం ఈ ఉత్సవంలో పాల్గొన్న చిన్నారులందరికీ సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందించారు. ప్రిన్సిపాల్స్ సంగీత, సుజాత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

గోల్కొండ: రెజ్లింగ్‌పై నేటి యువత మొగ్గు చూపుతుందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం ఆయన కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెజ్లింగ్ కేవలం ఉత్తరాధి రాష్ట్రాలకే పరిమితమయ్యేదని అయితే నేడు తెలంగాణలో రెజ్లింగ్ పోటీలకు ఆదరణ పెరిగి ఇక్కడి రెజ్లర్లు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. పాఠశాల విద్యార్థులకు రెజ్లింగ్ పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు హైస్కూల్ విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలని దీన్ని వల్ల రెజ్లింగ్‌లో యువకులు సత్తాచాటే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సచిన్ కామ్లెకర్‌తో పాటు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీదేవి, రెజ్లింగ్ కట్ట నర్సింగ్ రావు, కన్వీనర్ కె.బాల్‌రాజ్, కో కన్వీనర్ సీహెచ్. శ్యామ్‌రావు తదితరులున్నారు.

సర్వేను సమగ్రంగా నిర్వహించాలి

రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి

శంషాబాద్: కులగణన సర్వేను సమగ్రంగా చేపట్టాలని రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన శంషాబాద్ పట్టణంలోని తొండుపల్లి తదితర వార్డుల్లో ఆయన పర్యటించారు. సర్వేను చేపడుతున్న ఎన్యూమరేటర్ల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన అంశాలపై సవివరంగా సమాచారం సేకరించాలన్నారు. అనంతరం వార్డుల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ జాబితాల సవరణకు సంబంధించిన అంశాలను ఆయా వార్డుల్లోని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ రవీందర్ దత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి...

బండ్లగూడ: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమంలో భాగంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆదివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పరిశీలించారు. 5వ డివిజన్‌లోని ఫోర్ట్ వ్యూ అపార్ట్‌మెంట్, 14వ డివిజన్‌లోని గిరిధారి పార్క్, 16వ డివిజన్‌లోని లక్ష్మినగర్ కాలనీ, 17వ డివిజన్‌లోని బాలాజీనగర్‌లలో ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను నమోదు చేయించారు. ఎన్యూమరేటర్లు సమగ్ర ఇంటింటి సర్వేను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలు సర్వేకు సహకరించాలని సూచించారు.



వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి



గిరిధారి పార్కులో బండ్లగూడ కమిషనర్ శరత్‌చంద్ర